# మిథ్యాజీవితం

పాపినేని శివశంకర్.

## చక్రవర్తుల బతుకే అంత.

పాతబడ్డ గోడ గడియారం ఆరు గంటలు కొట్టగానే ఉలిక్కిపడి నిద్ర లేస్తాడు చక్రవర్తి. పడుకునే ఒక్కసారి పెంకుటింటి కప్పు కంతల్లోంచి లోనికి రావాలని ప్రయత్నిస్తున్న వెలుతురు వంకా, బూజు పట్టిన వాసాల వంకా చూస్తాడు.

ఇంతలో ఇంటిముందు పారుతున్న మురికి కాలవ దుర్గంధం గుప్పున ముక్కుపుటాలకు సోకుతుంది. మరుక్షణం చక్రవర్తి మంచం మీద నుంచి లేస్తాడు.

నేరుగా దేవుడి గూడు వద్దకి వెళ్ళి రంగు వెలిసిన వేంకటేశ్వరస్వామి పటానికి భక్తిగా నమస్కరిస్తాడు. నిద్ర లేవగానే దేవుడి మొహం చూడాలని చక్రవర్తి నమ్మకం. కానీ, అంతకుముందే ఇంటి వాసాల వంకా, వాటికి పట్టిన బూజు వంకా చూసిన సంగతి గుర్తురాదు.

వేకువజామునే నిద్ర లేచిన చిన్న కొడుకు ఏడో తరగతి పాఠాల్ని లైటు వెలుగులో నెమరు వేస్తుంటాడు. ఆరు దాటినా లైటు వెలుగుతూ వుండటం వల్ల చక్రవర్తి మనస్సు చివుక్కుమంటుంది. ఎవరో తరుముతున్నట్టు లైటు ఆర్పేసి, కరెంటు ఆదాచేసి, పెరట్లోకి వెళతాడు. గూట్లో బొగ్గుముక్క తీసుకుని గుండ్రాయితో రోటి మీద మెత్తగా నూరి, ఆ పొడితో పళ్ళు కీచుకీచు మని పిస్తాడు. పిల్లలు గొణుగుతున్నా ఏనాడు పళ్ళపొడి కొని తీసుకురాడు. ఏభై యేళ్ళొచ్చినా చెక్కు చెదరని తన పళ్ళు చూపించి, బొగ్గుపొడి మహిమ వివరిస్తాడు. పళ్ళు తోమడం ముగించి, చారెడు నీళ్ళు నోట్లో పోసుకుని పుక్కిలించి ఊస్తాడో లేదో వంటింట్లో భార్య దభీమని నీళ్ళ బిందె దించిన చప్పుడు వినిపిస్తుంది. బిందె సొట్ట పడిందేమోనని చక్రవర్తి గుండెలు గుబగుబలాడతాయి. ఇంతలో భార్య కంఠం ఖంగుమని వినిపిస్తుంది.

“మాయదారి మూక, మాయధారి మూకని! ఇంత జనం ఎక్కడ మూగుతారో కుళాయి దగ్గర? బిందెడు నీళ్ళు పట్టుకోడానికి ఘంటసేపు యుద్ధం చేయాలి. ఇంటికొచ్చేసరికి సగం నీళ్ళు నేలపాలు. ఈ చిల్లుల బిందెని ఏ సామాన్లవాడికో అమ్మేసి, కొత్త బిందె కొనమని శత పోరు పెడతాను. వింటేగా? ఇదుగో, ఏవండోయ్? ఇవ్వాళ్ళ గనక కొత్త బిందె కొనుక్కు రాకపోతే చూసుకోండి. రాత్రికి పొయ్యిలో బొమ్మరాయి కొడతాను”.

ఈ మాటలకి చక్రవర్తి గట్టిగా కావాలని నవ్వుతాడు. భార్య కోపాన్ని అతనెప్పుడూ సీరియస్‌గా తీసుకోడు. తేలిగ్గా కొట్టి పారేస్తాడు.

“ఓస్! నీ కోపం నాకు తెలీదటోయ్! పాల పొంగు. చూడూ! ఆ బిందె మా తాత తరంనాటిది. మహ ఘట్టిది. దాన్ని అమ్మేస్తే మళ్ళీ అలాంటిది గింజుకున్నా దొరకదు. పైగా తక్కువ కడుగుతారు. ఇహ కొత్త బిందె లంటావా? ఉఫ్ అంటే ఎగిరిపోతాయి. అంచేత కొత్త బిందె కొననుగాక కొనను. నీ కోపం ఎలా వుంటుందో చూద్దాం. కాస్సేపలా చిచ్చుబుడ్డిలా ఎగురుతావు గానీ, నీ మనస్సు నాకు తెలీదూ?”

“సదేలే సంబడం” అంటుంది భార్య.

చక్రవర్తి ఊపిరి పీల్చుకుంటాడు. చల్లారుతున్న భార్య కోపం ఏడింటిదాకా మంచం దిగని ఇరవై ఏడేళ్ళ కూతుర్ని చూడగానే మళ్ళీ రాజుకుంటుంది. వంటపని అందుకోకుండా దర్జాగా పడుకున్నందుకు శాపనార్థాలు పెడుతూ లేపుతుంది. లలిత గునుస్తూ కళ్ళు నులుము కుంటూ లేస్తుంది. నిజానికది నిద్ర కాదు. నిద్ర లాంటి మెలకువ. మేలుకునే మనస్సును బలవంతాన జోకొట్టి, కలలో చక్కని హీరోతో హనీమూన్ సాగించే ప్రయత్నం. కూతురు పెద్దమనిషైనప్పటి నుంచి సీతమ్మ కనుమానం—అది కూడా పెద్దదానిలాగా ఎప్పుడు ఏ తలమాసినవాడితో లేచిపోతుందోనని.

గడియారం ఎనిమిది గంటలు కొట్టడం కోసం చక్రవర్తి కాలు కాలిన పిల్లిలా అటూ ఇటూ పచార్లు చేస్తాడు—అడ్డొచ్చిన ప్రతి వస్తువునూ తన్నుకుంటూ తూలిపడుతూ. ఎనిమిదో గంట కొట్టీ కొట్టగానే గావు కేక పెడతాడు-వంటయిందో లేదోనని. ఉద్యోగాని కాలస్యం కావడం చక్రవర్తికి గిట్టదు. భోజనం ముందు ముళ్ళ మీద కూర్చుంటాడు. ఉడికీ, ఉడకని వేడివేడి మెతుకుల్ని నోట్లో వేసుకుంటాడు. మరుక్షణం దండెం మీదున్న చొక్కా తిరగేసి తొడుక్కుంటాడు. మళ్ళీ విసుక్కుంటూ సరిగ్గా తొడుక్కోబోతాడు. ఎడమ చెయ్యి చొక్కా చిరుగులోంచి బయటకి వస్తుంది. ఎలాగైతేనేం ఆ పని ముగించి ఎడమ భుజం మీద కండువా వేస్తాడు చిరుగు కన్పించకుండా. తనింకా ఇంట్లో వుండగానే గడియారం తొమ్మిది గంటలు కొడుతుందేమోననే భయంతో గబగబా గుమ్మం దాటుతాడు. ఇంతలో పెద్ద కొడుకు వచ్చి ఫలానా కంపెనీలో ఉద్యోగానికి అప్లికేషన్ పెట్టడానికి అయిదు రూపాయి లడుగుతాడు. ఐదేళ్ళనాడు డిగ్రీ పుచ్చుకుని ఇంకా ఉద్యోగం వేటలో వున్న కొడుకు మీద చక్రవర్తి కెంతో జాలీ, ప్రేమా కలుగుతాయి. తక్షణం వంద రూపాయ లైనా ఇచ్చేద్దామనిపిస్తుంది. కానీ, జేబులో ఒకే ఒక్క రూపాయి మాత్రం వుంటుంది. అప్లికేషన్ మర్నాడు పెట్టొచ్చు లెమ్మని కదులుతాడు. ఆ సమయంలో కొడుకువంక చూడ్డానికి మొహం చెల్లదు.

ఇంటి ముందు గలగలా ప్రవహించే మురుగుకాలవ నెలా దాటాలనేది చక్రవర్తిని ప్రతి రోజూ వేధించే సమస్య. చెప్పులు తడిసి చివికిపోతాయనే భయంతో ముందుగానే వాటిని భద్రంగా చేతబట్టుకుంటాడు.

కాలవ వెడల్పు తక్కువగా వున్న చోటు చూసి ఒక అడుగు ముందుకి వేసి, మళ్ళీ వెనక్కి తగ్గి ఒక్క వూపున గంతేస్తాడు. కానీ, ఎడమ కాలు కుడికాలుతోపాటు ముందుకి రాక రొచ్చులో పడుతుంది. ఎవరైనా చూశా రేమోనని అటూ ఇటూ పరకాయిస్తాడు చక్రవర్తి. కాలు తడిసినా కాలవ దాటాననే సంతృప్తి మిగులుతుంది. ఒకదాని మీద మరొకటిగా కిక్కిరిసిన ఇళ్ళున్న ఆ సందు దాటి మెయిన్ రోడ్డు మీద అడుగు పెడతాడు. అక్కణ్ణుంచి తన గుమాస్తా పనిలో చేరడానికి ఇచ్చి తంగా మైలున్నర నడవాలి: నిదానంగా పోయే సైకిల్ వేగంతో నడిస్తే సరిపోతుంది. దిక్కులు చూస్తూ సినిమా వాల్‌పోస్టర్లు గమనిస్తూ వెళితే తప్పకుండా ఆలస్యమవుతుంది. అందుకే చక్రవర్తి పూర్తిగా తలొంచుకుని పెద్ద పెద్ద అంగల్తో గుండెలు కొట్టుకుంటుండగా నడుస్తాడు. అటూ ఇటూ శరవేగంతో పోతున్న వాహనాల రొదగానీ, చెవులు గింగిర్లెత్తే హారన్ ధ్వనులు గానీ అతనికి విన్పించవు. వెళ్ళే దారంతా అతనికి కొట్టిన పిండే. తలెత్తనవసరం లేదు. అర మైలు నడవగానే రోడ్డు మీద పెద్ద గుంట కనిపిస్తుంది. అక్కణ్ణుంచి సుమారు ముప్పాతిక మైలు నడవగానే రోడ్డు ఎత్తు పల్లాలుగా కాళ్ళకు తగుల్తుంది. అక్కడ కుడివైపు వీథివెంట సరిగా నూట ఇరవై మూడడుగులు నడిస్తే చాలు—సేఠ్ చమన్‌లాల్ నగల షాపు వస్తుంది. ఒక్కోసారి రోడ్డుమీద

ఎవడో పరిచయస్థుడు తారసపడినప్పుడే చక్రవర్తికి ఇబ్బంది.

"ఏరోయ్! బాగున్నావా?"

"............"

"ఒరేయ్ చక్రవర్తీ! నిన్నేరా?" అంటూ ఒకానొక బాల్య మిత్రుడు చక్రవర్తి భుజం పట్టుకు ఆపుతాడు. అప్పుడీలోకంలోకి వస్తాడు చక్రవర్తి.

"అరెరె...నువ్వటోయ్ రామ్మూర్తీ! ఎవరో అనుకున్నాను సుమా! బాగున్నావా? అప్పుడే మారిపోయావు గూడాను."

"అప్పుడే ఏమిటి? మనం కలుసుకుని పుష్కరం దాటింది".

"అబ్బా! అన్ని సంవత్సరాలైందీ?" ఆశ్చర్యపోతాడు చక్రవర్తి.

తను చమన్‌లాల్ షాపులో మంచి ఉద్యోగం చేస్తున్నాననీ, నగరంలో అంతకుమించిన నగల షాపు లేదనీ, యజమానికి తనంటే ఎంతో గురి అనీ వివరిస్తాడు చక్రవర్తి. అనంతరం హడావుడిగా కదుల్తాడు స్నేహితుడి వద్ద సెలవు తీసుకుని. తీరా షాపుకి వెళ్ళేసరికి చమన్‌లాల్ అప్పుడే దేవుడి పటానికి నమస్కరించి, అగరొత్తులు వెలిగిస్తుంటాడు. పది గంటలకి పది నిముషాలు ముందే వచ్చిన గుమాస్తాని చూసి చిరునవ్వు నవ్వుతాడు. చక్రవర్తి గాభరాగా నమస్కరించి, ఆలస్యానికి క్షమాపణ వేడుకుని తన గుమాస్తా బల్ల ముందు చతికిల పడతాడు. గుండె దడ తగ్గుతుంది. కండువాతో మొహం తుడుచుకుంటాడు. దైవాన్ని తలచుకుని పనిలో పడతాడు.

చక్రవర్తికి తను రాసే పద్దుల పని దేవుడితో సమానం. ముందుగా పుస్తకాన్ని కళ్ళ కద్దుకుని తెరుస్తాడు. మూసిన కళ్ళద్దాల్ని తుడిచి తగిలించుకుంటాడు. ముందురోజు రాసిన పద్దుల లెక్కలన్నీ సరిపోయాయో లేదో మళ్ళీ తిరగజూస్తాడు. ఎక్కడా నలుసంత తేడా వుండదు. చక్రవర్తి సంతృప్తిగా తలాడిస్తాడు. పదకొండు గంటల నుంచే చక్రవర్తి బిజీ అయిపోతాడు. ఎవరెవరో వచ్చి కొన్న నగలన్నిటినీ తూకం వేసి లెక్కలు కట్టాల్సి వుంటుంది. తనవద్దకి వచ్చే ఒక్కో నగనూ ప్రేమగా






నిమిరి భద్రంగా తూకం గట్టి ఇస్తాడు. ఎవరైనా పాత నగను తెచ్చి వెడగొట్టించడానికి ఇచ్చినప్పుడు చక్రవర్తి బాధపడిపోతాడు. దాని అసలు రూపం మాసిపోతుంది గదా అని జాలిపడతాడు.

పద్దు పుస్తకాల్లో అక్షరాలు గుండ్రంగా ముత్యాల కోవలా వుండాల్సిందే. ఏ మాత్రం వంకా వాసీ వుండరాదు. ఎక్కడైనా ఒక అక్షరం వంకరపోయిందంటే తనకి పనిలో ఏకాగ్రత తప్పిపోయిందని విచారిస్తాడు చక్రవర్తి. తక్షణం ఆ అక్షరం కొట్టేసి మళ్ళీ రాస్తాడు. ఆ కొట్టివేత వల్ల ఆ పద్దుల పేజీ సౌందర్యం ఏమన్నా తగ్గిందేమోనని పేజీ నంతటినీ లాంగ్ షాట్‌లో చూస్తాడు. సాయంత్రందాకా పద్దుల పుస్తకం చక్రవర్తి గూడు. గూట్లో ఎంతైనా సుఖంగా వుంటుంది.

అక్కడ పనిచేసే వాళ్ళందరిలోనూ షో కౌంటర్‌లో వుండే కుర్రాడంటే ఎంతో ఇష్టం చక్రవర్తికి. అతను సన్నగా, ఎర్రగా, చాకులా వుంటాడు. కస్టమర్లతో అతను మాట్లాడే పద్ధతి చూస్తుంటే ముచ్చటేస్తుంది తనకి. లోపలి కదుగు పెట్టిన వాళ్ళు ఏదీ కొనకుండా తిరిగి వెళ్ళడానికి వీల్లేదు. అతనిలో చక్రవర్తికి నచ్చని అంశమల్లా- ఆ కుర్రాడు తనని 'తాతగారూ!' అని పిలవడమే. 'మామయ్యా' అని పిలిస్తే బాగుంటుందని పిస్తుంది చక్రవర్తికి. చిన్న కూతురికి మాంఛి జోడీ అవుతాడు. కానీ ఆ వుద్దేశ్యం ఎప్పుడూ బయటపెట్టడు చక్రవర్తి. ఆ కుర్రాడు గబుక్కున




కాదంటే ఎంత చిన్నతనం! ఇంట్లో భార్య రోజా సణుగుతుంటుంది— రెండోది కూడా ఏ తల మాసినవాడితోనో లేచిపోక ముందే ఆ మూడు ముళ్ళు వేయించమని. తనూ ఆ ప్రయత్నంలోనే వున్నట్టు చెబుతాడు చక్రవర్తి. పెళ్ళంటే మాటలా? నాలుగు డబ్బులు గలగలలాడే సమయం రావాలి. ఎప్పుడొస్తుందో చక్రవర్తి చెప్పడు. కూతురికి తొందరగా పెళ్ళి చెయ్యమని దేవుడికి అర్జీ పెట్టుకుంటాడు.

పద్దుల పనితోపాటు ఒక్కోసారి షో కౌంటర్‌లో పని కూడా చూడాల్సి వస్తుంది చక్రవర్తికి. కస్టమర్లకి నగలు చూపించి వాటి నాణ్యం వివరిస్తాడు. బంగారు గాజులు, రాళ్ల దుద్దులు, రవ్వల నెక్లెస్‌లు-ఇంకా ఎన్నో వస్తువుల్ని తన చేతుల్తో తడిమి, జారి పడతాయేమోనన్న భయంతో భద్రంగా పట్టుకుని ప్రదర్శించడం చక్రవర్తికెంతో ఇష్టమైన పని. ఆ సమయంలో షాపంతా తన మీదే ఆధారపడివుందనే భావం కలుగుతుందతనికి. నడిచి వచ్చేవాళ్ళకి, స్కూటర్ల మీద వచ్చేవాళ్ళకి, కారుల్లోంచి దిగేవాళ్ళకి ఎలాంటి వస్తువులు చూపించాలో కొట్టిన పిండి చక్రవర్తికి.

ఉన్నట్టుండి షాపు ముందు ఓ విమానమంత కారు ఆగుతుంది. డ్రైవర్ వెనక డోర్ తెరిచి నిలబడతాడు. సీట్లోంచి ఇద్దరు భార్యాభర్తలు దిగి హుందాగా లోపలికి ప్రవేశిస్తారు. ఖరీదైన సూట్లో వున్న అతని నోట్లో పైపు వెలుగుతుంటుంది. భార్య హైహీల్స్‌తో, జారిపోయే చీరతో, స్లీవ్‌లెస్ జాకెట్‌తో, మేకప్‌తో, లిప్‌స్టిక్‌తో షో కేస్‌లో బొమ్మలా వుంటుంది. వాళ్ళని చూసీ చూడగానే ప్రొప్రయిటర్ చిరునవ్వుతో ఆహ్వానిస్తాడు. కాఫీలు తెప్పిస్తాడు. ఎయిర్‌కండిషన్డ్ రూములో పైపు వెలుగుతున్నా పట్టించుకోడు. కౌంటర్ వద్దకి ఆహ్వానించి కొత్త వెరైటీలు మాత్రమే చూపించమని చక్ర

తప్పక దయచేయండి
హోటల్ కాకతీయ
నాంపల్లి స్టేషన్ రోడ్
హైదరాబాద్
ఫోన్లు : 43926, 553767-70, 46555
గ్రామ్స్ : 'ఏకశిల'



ఆబిడ్స్‌లోని ఆధునిక వ్యాపార కూడలిమధ్య నెలకొల్పబడినది. నాంపల్లి రైల్వేస్టేషన్‌నుండి కేవలం 5 నిముషాల నడక, ఆర్టీసి బస్ డిపోనుండి 2 కి.మీ. మరియు ఎయిర్ పోర్టునుండి 7 కి.మీ. దూరం మాత్రమే.

124 ఏయిర్‌కండిషన్డ్ మరియు ఏయిర్‌కూల్డ్ గదులు. అందరికి అందుబాటులో రూ. 65/ నుండి రూ. 150/ వరకు. చంద్రల రెస్టారెంట్ (ఏ.సి.). సమావేశాలకు, వివాహాలకు అతిపెద్ద కాన్ఫరెన్స్ హాల్(ఏ.సి.)

30-4-86న డ్రా తీసిన
యద్దనపూడి సులోచనారాణి
డైరెక్ట్ నవల
మౌనపోరాటం (వెల: రూ.20/-)
లక్కీ లాటరీ డ్రా విజేతలు
మొదటి బహుమతి రూ. 1000/- నెం. 8495
20 కన్సొలేషన్ బహుమతులు రూ. 50/- చొ॥న
నెంబర్లు : 1440, 9377, 6831, 1180, 4747, 9564, 2427, 5387, 7147, 2764, 1770, 7125, 5266, 8701, 6846, 6330, 6124, 1558, 4725, 9159.

విజేతలు పుస్తకం చివర ఉన్న కూపనును మాకు రిజిష్టర్డ్ పోస్టులో పంపితే బహుమతి పైకాన్ని ఎమ్.ఓ. ద్వారా పంపిస్తాము.

డ్రా నిర్వాహకులు:
ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్
3237, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్-500 003

వర్తికి పురమాయిస్తాడు.

"సార్! చెప్పండి తమకేం కావాలో?" వినయంగా అడుగుతాడు చక్రవర్తి.

"తెలియనట్టు అడుగుతావేం చక్రవర్తీ! కొత్త వెరైటీస్ అన్నీ చూపించు. అయ్యగారికి ఏవి నచ్చితే అవే తీసుకుంటారు" అని చమన్‌లాల్ మందలిస్తాడు.

చక్రవర్తి పశ్చాత్తాపపడి షో కేస్ కున్న అద్దాల తెర తప్పించి, ఒక్కో నగ తీసి ప్రదర్శిస్తాడు.

"సార్! ఈ గాజులు చూడండి. కొత్త డిజైన్. ఇంతవరకు మన సిటీకి రాలేదు".

ఆమె వాటినొక్క క్షణం అలవోకగా చూసి, అవతల పడేస్తుంది.

"వాట్ డాళింగ్! నచ్చలేదా?" అంటాడతను.

"నో. ఓల్డ్ డిజైనే. మీకు నచ్చితే మీరే తీసుకోండి" అంటూ కిలకిలా నవ్వుతుంది డాళింగ్.

"అమ్మగారికి భలే సెన్సాఫ్ హ్యూమర్ వుంది సార్!" అంటాడు ప్రొప్రయిటర్ పెద్దగా నవ్వుతూ. చక్రవర్తి కూడా ఓ వెర్రి నవ్వుతో శ్రుతి కలుపుతాడు.

"పోనీ ఇవి చూడండి సార్! బొంబాయి నుంచి ఇవ్వాళే దిగాయి" అంటూ ఉంగరాలు, దుద్దులు వున్న కేసుల్ని ముందు పెడతాడు చక్రవర్తి.

ఆమె అందులో ఓ జత దుద్దుల్ని తీసుకుని, చెవులకు పెట్టుకుని అద్దంలో చూసుకుంటుంది. ఎలా వున్నా యని ప్రశ్నిస్తాయి డాళింగ్ కళ్ళు.

"అద్భుతం మేడమ్! చక్కగా మేచ్ అయ్యాయి" అంటాడు చక్రవర్తి.

"ఐ డోంట్ లైక్" అంటూ డాళింగ్ వాటిని తీసి నిర్లక్ష్యంగా పడేస్తుంది.

ఈసారి చక్రవర్తి షో కేస్‌లోనూ, లోపలా వున్న నెక్లెస్‌ల రకాలన్నీ చూపించి, వాటి నాణ్యత గురించి శ్రద్ధగా ఉపన్యసిస్తాడు. ఏమీ కొనకుండా వెళ్ళిపోతే తనకెంత పరువు తక్కువ! చివరి కందులో ఒక రవ్వల నెక్లెస్‌ని సెలక్ట్ చేస్తుందామె. ఆ సెలక్షన్ భర్తకీ, చక్రవర్తికీ, ప్రొప్రయిటర్‌కీ తక్షణం నచ్చుతుంది. వెంటనే చక్రవర్తి దాన్ని అందమైన మొఖమల్ కేసులో ప్యాక్ చేయిస్తాడు. తన ద్వారా అంత విలువైన వస్తువు అమ్మకం కావడం ఎంతో గర్వకారణం చక్రవర్తికి. భార్యాభర్తలు కారెక్కుతారు. చక్రవర్తి వినయంగా కారు వద్దకి నడిచి, ఇంకా వినయంగా ప్యాకెట్ అందించి, మరీ వినయంగా నమస్కరిస్తాడు. థ్యాంక్స్ చెబుతుంది డాళింగ్. చక్రవర్తి మొహం వెలిగిపోతుంది. కారు కదిలేలోగా దాని అందాన్ని ఒక్కసారి తాకి లోపలికి వస్తాడు.

ప్రొప్రయిటర్‌కి చక్రవర్తిమీద బోలెడంత విశ్వాసం. అతణ్ణి చూస్తుంటే తన ఇంట్లో కట్టేసి వున్న జానీ గుర్తొస్తుంది. అవే చూపులు. యజమాని ఆజ్ఞ కోసం, బిస్కెట్ కోసం ఎదురు చూసే చూపులు. యజమానికి తన మీదున్న నమ్మకానికి మురిసిపోతాడు చక్రవర్తి. అందుకు బదులుగా మరింత విశ్వాసంతో పని చెయ్యాలని నిశ్చయించుకుంటాడు. చమన్‌లాల్‌కీ, అతనికీ పాతికేళ్ళ అనుబంధం. పాతికేళ్ళనాడు చమన్‌లాల్ ఎక్కడినుంచో పట్నం వచ్చి, కొద్ది పెట్టుబడితో వెండి నగల వ్యాపారం పెట్టాడు. అప్పుడే చక్రవర్తి అతని దగ్గర గుమాస్తాగా చేరడం జరిగింది. అప్పటినుంచీ వ్యాపారం అంచెలంచెలుగా వర్ధిల్లినా, అందుకు గుర్తుగా చమన్‌లాల్ బొజ్జ కూడా వర్ధిల్లినా, చక్రవర్తి మాత్రం వినయంతో అలానే వుండిపోయాడు. యజమానికీ, తనకీ వున్న సంబంధ మేనాటిదో అవకాశం దొరికినప్పుడల్లా తోటి వాళ్ళకి చెబుతాడు చక్రవర్తి. పాత కాలపు సంగతులు చెప్పేటప్పుడు మైమరచిపోతాడు. వయస్సునుబట్టి ఆ పాత కాలం మీద తక్కినవాళ్ళకి లేని అధికారం తనకుంది. ప్రతి దీపావళికీ యజమాని తనను పిలిచి జీతం పది రూపాయిలు పెంచినట్టు చెబుతాడు. చక్రవర్తి వినయ భారంతో మరింత కుంగిపోతాడు. కృతజ్ఞతతో అతని కళ్ళు చెమర్చుతాయి. "అయ్యా! మీ ఋణం ఎలా తీర్చుకుంటానో" అంటాడు. యజమాని చిరునవ్వు నవ్వుతాడు.

షాపులో పని ముగిసేసరికి ఎప్పటిలాగానే పొద్దు బోతుంది. యజమానికి నమస్కారం చేసి సెలవు తీసుకుంటాడు చక్రవర్తి. యథాప్రకారం తల వంచుకుని మైలున్నర నడిచి మురుగు కాలువ మీదగా గెంతి ఇంట్లోకి ప్రవేశిస్తాడు. ఆపాటికి చిన్న కొడుకు నిద్రపోతుంటాడు. కూతురు పక్కింటి నుంచి తెచ్చిన రొమాంటిక్ నవల ఏకదీక్షగా చదువుతుంటుంది. పెద్ద కొడుకు ఇంకా ఇల్లు చేరడు. తను ఇంట్లోకి రాగానే భార్య ఆ రోజు కిరాణా కొట్టువాడు వచ్చి నానా మాటలూ అని వెళ్ళిన సంగతి పూసగుచ్చినట్టు చెబుతుంది.

"అదేమిటోయ్? మనమేమన్నా పారిపోతామా? ఫస్టు తారీకు రాగానే బాకీ అణా పైసల్తో సహా తీర్చేస్తామని చెప్పలేకపోయావ్? అతని బాకీ ఎంత జేసు? అతనెంత జేసు? ఇలా పరువుగలవాళ్ళ ఇంటికి వచ్చి యాగీ చేసి వెళతాడూ? రేప్పొద్దునే వెళ్ళి మొహం మీదనే నాలుగూ జాడించి వస్తాను చూడు. దేవుడు చల్లగా చూసి మనవాడికా ఉద్యోగం ఖాయమైందంటే ఈ కాస్త ఇబ్బందులూ తప్పిపోతాయి. ఉద్యోగం రాక మానుతుందా? తప్పకుండా వస్తుంది. ఇవాళ కాకపోతే రేపు. నువ్వేమీ విచారపడకు." అంటాడు చక్రవర్తి త్వరత్వరగా.


చక్రవర్తి జేబులో ఇలాంటి రెడీమేడ్ మాటలు చాలా వుంటాయనీ, వాటి వెనుక జీవశక్తి లేదనీ, అవి గాలి తోలితే పడిపోతాయనీ అతని భార్యకి బాగానే తెలుసు. అంచేతే భర్తచెప్పే మాటల్ని, అతని వాగ్దానాల్ని 'అయ్యో. నా దశ' అని ఒక్క ముక్కతో తేల్చి పారేస్తుంది.

చక్రవర్తి భోంచేసేసరికి తొమ్మిది గంటలు దాటుతుంది. కాసేపు అటూ ఇటూ పచార్లు చేసి, వసారాలో మంచం మీద వాలతాడు. కుక్కి మంచం కిర్రుమంటుంది. ఎంతసేపటికీ నిద్ర రాదు. ఇంట్లోకి గాలి చొరబడే అవకాశం లేక ఉక్క పోస్తుంది. బయట నుంచి మురుగు కాలువ గురగుర వినిపిస్తుంటుంది. ముక్కుపుటాలు బద్దలయ్యే వాసన. జోరీగల్లా ముసురుకునే దోమల సంగీతం. పడుకున్న గంటసేపటి దాకా దోమలతో హోరాహోరీ యుద్ధం చేసి, చివరికి ఓడిపోయి శరీరం దోమల కప్పజెప్పి, బలవంతాన నిద్రపోతాడు చక్రవర్తి. తిరిగి నిద్ర లేచేసరికి ఒంటి నిండా దద్దుర్లూ, కొడుక్కి ఉద్యోగం వచ్చినట్టు కన్న కలా మిగులుతాయి.

వర్షాకాలంలో రాత్రి భయంకరంగా వుంటుంది ఇంట్లో. ఏ అర్ధరాత్రో వర్షం మొదలైందంటే ఇల్లంతా కురుస్తుంది. ధారల కింద చెంబులూ, పాత్రలూ పెడుతుంది భార్య. కాస్త తడవని ప్రదేశం చూసి పడక లక్కడికి మారుస్తాడు చక్రవర్తి. ఇంతలో అక్కడా ధార కురుస్తుంది. మళ్ళీ పక్కలు మరో చోటికి. రాత్రంతా జాగారం. అయినా సర్దుకుపోయే మనస్తత్వం చక్రవర్తిది. పాత ఇంటికి భార్యలా ఏ మాత్రం అసహ్యించుకోడు. దాన్ని కప్పించే ప్రయత్నం అంతకంటే చెయ్యడు.

ఆదివారం వచ్చిందంటే చక్రవర్తికేమీ తోచదు.

బహుమతి పొందిన కార్టూన్.




క్రోజా మాదిరి పద్దుల పుస్తకం ముందు కూర్చుని ఆ అక్షరాల, అంకెల లోకంలో మునిగిపోయే అవకాశం లేనందువల్ల ఊపిరి బిగదీసినట్టుంటుంది. కాసేపు ఇంట్లోకీ, బయటకీ కాలు కాలిన పిల్లిలా తిరుగుతాడు. చివరికి కండువా మీదేసుకుని నాలుగిళ్ళ అవతల శాస్త్రి గారింటికి వెళతాడు. చక్రవర్తిని చూడగానే శాస్త్రిగారు కళ్ళజోడు సర్దుకుని పేపరందుకుంటాడు. శాస్త్రిగారి పేపరు పఠనం రాగయుక్తంగా సాగుతుంది. ఇరాన్‌లో భూకంపం గురించీ, ఇండియాలో రైలు ప్రమాదం గురించీ రసవత్తరంగా చదువుతుంటే చక్రవర్తి ఆశ్చ ర్యంతో మైమరచిపోతాడు.

''అబ్బా! భూకంపంలో అంత మంది చచ్చిపోయా రటండీ?......చావరూ మరీ? భూకంపమా మజాకా? భూమి దద్దరిల్లిపోతుంది మరి. మీకు గుర్తుండే వుండాలి. మన చిన్నతనంలో— గొట్టికాయ లాడుకునే టప్పుడు—బ్రహ్మాండమైన భూకంపం వచ్చింది. అప్పుడు మా తాతగారు ఇలా నేల మీద నిలబడి గంభీరంగా ఏదో మంత్రం పఠించారు. అంతే! అంత భూకంపమూ ఠపీమని నిలిచిపోయింది. ఆ కాలమే వేరూ! ఆ నిష్ఠ, ఆ మహిమా ఇప్పుడెక్కడివండీ? ...ఏదీ...ఆ రేడియో కాస్త పెట్టి ఒక్క పాట విని పిద్దురూ. చెవులు తుప్పట్టిపోయాయి''.

సంభాషణ ముగిసేసరికి ఇద్దరూ వర్తమానం కంటే గత కాలమే మేలనే తీర్మానానికి వస్తారు. గత కాలం గుల్లలో దాక్కున్న చక్రవర్తిని భోజనాల వేళ బయటకి లాగుతుంది. తిన్నగా ఇంటికి వచ్చి భోం చేస్తాడు. మధ్య మధ్య ఆ రోజు పేపర్లోని విశేషాలు భార్యకి పూసగుచ్చి నట్టు చెబుతాడు- తనూ ఆశ్చర్యపోతూ.

''ఈ మాయదారి కబుర్లు కూటికొచ్చేనా? గుడ్డ కొచ్చేనా? దాని పెళ్ళి సంగతి మాత్రం పట్టించుకోరు గదా! చెప్పీ చెప్పీ నా నోరు పడిపోతుందే తప్ప మీకు చీమ కుట్టినట్టయినా వుండదు'' అని భార్య సతాయిస్తుంది.

''దాని కెంత వయస్సే? నిన్న కాక మొన్న కళ్ళు తెరిచింది. అయినా నీ పిచ్చి గానీ, మనం అనుకున్నంత మాత్రాన అవుతుందా? కాలం, కర్మా కలిసి రావాలి. చూస్తుండు. దానికి తప్పకుండా మాంఛి మొగుడొస్తాడు. అసలు దాని జాతకమే అంత. దివ్యమైన జాతకం. నువ్వూరికే తొందరపడకు'' అని భరోసా ఇస్తాడు చక్రవర్తి. భార్య నిట్టూర్పుతుంది. ఆ సమయంలో అతనికి షాపులోని కుర్రాడు గుర్తుకొస్తాడు. వాళ్ళిద్దరికీ రంగ రంగ వైభవంగా పెళ్ళి జరిగినట్టే ఊహిస్తాడు.






భోజనానంతరం కాసేపు నిద్రపోతాడు చక్రవర్తి. సాయంకాలం బజారుకి షికారు వెళ్ళే అలవాటు లేదు చక్రవర్తికి. బజారుకి వెళితే ఏదో ఒకటి కొనాలనో, తినాలనో బుద్ధి పుట్టొచ్చు. అంచేత ఇంటి ముందున్న వేపచెట్టు నీడలో పడక్కుర్చీ వేసుకుని కూర్చుంటాడు. తాతల కాలంనాటి ఆ కుర్చీ అంటే చక్రవర్తికి ప్రాణం. దాన్లో నడుం వాల్చగానే భూతకాలంలోకి వెళ్ళిపోతాడు. చిన్నతనపు సంగతులన్నీ జ్ఞాపకం వస్తాయి. మనసు ప్రశాంత మవుతుంది.

చక్రవర్తికి సినిమాలకి వెళ్ళడం లాంటి దురభ్యా సాలు లేవు. అతను యాభై యేళ్ళ జీవితంలో చూసిన సినిమాల్ని వేళ్ళ మీద లెక్కపెట్టొచ్చు. చిన్నవాడు పుట్టిన కొత్తలో భార్యతో కలసి చూసిన సినిమాయే ఆఖరిది. అయితే ఏ నెలాఖరులోనో దగ్గర బంధువెవరో చక్రవర్తిని చూసి వెళ్ళడానికి వస్తాడు. ఉన్నట్టుండి బలవంతంగా సినిమాకి బయలుదేరదీస్తాడు. అప్పుడు చక్రవర్తి పడే ఇబ్బంది వర్ణనాతీతం. జేబులో పైసా వుండదు. కానీ వెళ్ళక తప్పదు. తీరా హాలు వద్దకి వెళ్ళాక క్యూలో చాకచక్యంగా బంధువు వెనకాల నిల్చుంటాడు. అతను జేబులో డబ్బు తీసి టిక్కెట్టు తీసుకునే సమయానికి 'ఎందుకోయ్? నేను తీసుకోనా?' అంటాడు. అతను గబుక్కున చెయ్యి బయటికి తీసి 'నిజమే సుమీ! మీ ఇంటికి వచ్చినప్పుడు నువ్వు తీసు కోవడమే న్యాయం' అంటాడేమోనని చక్రవర్తి గుండె గుబగుబ లాడుతుంది. కానీ, అతను ఆ విధంగా కాకుండా, 'ఫర్వాలేదులే. ఇంటర్వెల్‌లో కూల్‌డ్రింక్స్ ఇప్పించకుండా నిన్ను వదుల్తానా?' అంటాడు. చక్ర వర్తికి ఊపిరాడదు. ఇంటర్వెల్ రాగానే ఏవేవో విషయాల మీదకి అతని మనసు మళ్ళిస్తాడు. 'సినిమా బాగుంది కదూ?' అంటాడు. బంధువు హాల్లోంచి బయటికి రాగానే, 'మరే-అద్భుతంగా వుందనుకో. ఇటువంటి సినిమా ఈమధ్య నే చూళ్ళేదు. అయినా నువ్వు సెలక్ట్ చేయ్యడమేమిటి? బాగోక పోవడ మేమిటి?' అని సమాధానమిస్తాడు చక్రవర్తి. జీవితంలో ఏనాడూ రెండోవాళ్ళ మాటల్ని ఆమోదించడమే గాని, ఖండించే అలవాటు లేదు చక్రవర్తికి.

చక్రవర్తికి పండగలంటే భయం. ఎప్పుడన్నా ఏ పండగ సందర్భంగానో తప్పనిసరి అయినప్పుడు కూతు రికి రబ్బరు గాజులో, చిన్న కొడుక్కి లాగు గుడ్డో తెస్తాడు. ఇంట్లో పాయసం గీయసం లాంటి పదార్థాలు నిషేధం. ఆ సమయాల్లో చక్రవర్తి తన సంతానానికి పొదుపు వల్ల మేలేమిటో, ముందు జీవితంలో అదెంత లాభిస్తుందో ఉదాహరణలతో సహా వివరిస్తాడు. ఇలా ఏ ప్రత్యేకతా లేకుండానే చక్రవర్తి రోజువారీ జీవితం గడిచిపోతుంది. అయితే తన జీవితంలోమహానందం కలిగించిన సంఘటనలు కొన్ని లేకపోలేదు. అతని బాల్య స్నేహితుడు బజార్లో తారసపడి తన కార్లో చక్రవర్తి నెక్కించుకోవడం అందులో ఒకటి. పెళ్లయిన కొత్తలో సినిమా హాల్లో చీకట్లో తన భార్య చేతిని గిల్లిన సంఘ టన మరొకటి. తల వంచుకుని షాపుకు వెళుతుండగా రోడ్డు మీద ఎవరో పారేసుకున్న రూపాయి బిళ్ళ దొరకడం ఇంకొకటి.

ఏది ఎలా వస్తే అలా స్వీకరించే చక్రవర్తి జీవితం లోనూ మలుపులు తప్పవు. ఒక రోజు అతను ఇంటికి వచ్చేసరికి చిన్న కొడుకు జ్వరంతో ముణగదీసుకు పడు కుంటాడు. చక్రవర్తి లంఖణం చేయిస్తాడు. మర్నాటికి జ్వరం తగ్గుతుంది. చక్రవర్తి భార్యతో 'చూశావా? లంఖణం పరమౌషధం అన్నారు. నేనూ మీలాగా భయ






పడి వాణ్ణి ఏ ఇంగ్లీషు డాక్టరు దగ్గరికో తీసుకెళ్లాననుకో. నెలాఖరున ఎంత ఖర్చయ్యేది?' అంటాడు సంతోషంగా. కానీ, రెండో రోజుకి మళ్ళీ జ్వరం వస్తుంది. ఈసారి చక్రవర్తి కంగారు పడక తప్పదు. ఖర్చు తక్కువలో పోయేట్టు ఆ వీధిలో పేరుమోసిన నాటు వైద్యుణ్ణి పిలిపించి నాలుగు మాత్రలిప్పిస్తాడు. జ్వరం తగ్గినట్టే తగ్గి తిరగబెడుతుంది. చక్రవర్తికి కాళ్ళూ, చేతులాడవు. ఉక్కిరిబిక్కిరవుతాడు. ప్రశాంత జీవితంలో సంక్షోభం! భార్య పోరుతుంది మంచి డాక్టరుకి చూపించమని. నిజమే, కానీ నెలాఖర్న కూరగాయలు కూడా కొనకుండా పచ్చళ్ళతో కాలం గడుపుతున్న సమయంలో ఉన్నట్టుండి జేబులో డబ్బెలా మొలుస్తుంది? ఇక తెగించి సాహసించి చక్రవర్తి జీవితంలో తొలిసారిగా యజమానిని ముందు నెల అడ్వాన్సు అడుగుతాడు. చమన్‌లాల్ తన మార్కు చిరునవ్వు నవ్వి, చక్రవర్తి అలా అడగడం తప్పని సూచిస్తాడు. కొడుకు పరిస్థితి చెప్పి మళ్ళీ అడగడానికి నోరు పెగలదు చక్రవర్తికి. సాయంకాలం ఇంటికి వచ్చేసరికి కొడుకు జ్వరం తగ్గివుంటుంది. ఊపిరి పీల్చుకుంటాడు చక్రవర్తి. నౌకరీ నీతి తప్పి యజమానిని అడ్వాన్సు అడిగినందుకు పశ్చాత్తాపపడతాడు. కానీ, తెల్లవారేసరికి జ్వరం తిరగబెట్టి కొడుకు కొయ్యలా బిగుసుకుపోతాడు. భార్యాపిల్లలు శవం మీద పడి ఏడుస్తుంటే చక్రవర్తి కంటి వెంట నీటి చుక్క రాదు. అతని మనస్సు కుమిలి కుమిలి గడ్డ కట్టుకుపోతుంది.

జంతువులా కష్టాల్ని మరచిపోయే శక్తి చక్రవర్తికుంది. కానీ, కొడుకు చావు మరపుకు రాకముందే మరో చిత్రం జరుగుతుంది. ఆ రోజు షాపు నుంచి కాళ్ళీడ్చుకుంటూ ఇంటికి రాగానే భార్య ఏడ్పుల మధ్య, మొత్తుకోళ్ళ మధ్య కూతురు వాంతులు చేసుకుంటున్న సంగతి వివరిస్తుంది. అది అనారోగ్యం కాదనీ, అక్కడికి మూడిళ్ళ అవతల వుంటున్న స్టూడెంటు వల్ల వచ్చిన కడుపనీ ఆలస్యంగా తెలుస్తుందతనికి. చక్రవర్తి దిమ్మెరపోతాడు. కూతురు స్నేహితురాలి ఇంటికని వెళ్ళి ఏవో నవలలు తెచ్చుకుని చదువుతుందని మాత్రమే గానీ, తమకి తెలీకుండా ఏ కుర్రాడి వలలోనో పడి కడుపు తెచ్చుకునేంత పెద్దదైందని మాత్రం అతని కప్పటిదాకా తెలీదు. పెద్దమనిషై పదేళ్ళు దాటిన, ఇరవై ఐదేళ్ళ కూతురికి కడుపు కాకముందే పెళ్లి చేయ్యలేకపోయినందుకు భార్య చక్రవర్తి మొహం మీద చేతులు చాపి తిడుతుంది. పెద్ద కొడుకు పట్టరాని కోపంతో చెల్లెల్ని చావబాదుతాడు. ఆమె ఏడవదు. చేసిన పని తప్పని తండ్రి కాళ్ల మీద పడదు. కూతుర్ని సరికి పోగులు పెట్టాలో, కడుపు తీయించాలో, ఆ కుర్రాడి కాళ్ళా వేళ్ళా పడాలో చక్రవర్తికి తోచదు. ఆ రాత్రి చక్రవర్తికి నిద్ర పట్టదు. శరీరం దద్దుర్లు తేలేట్టు కుడుతున్న ఇనుప ముక్కుల దోమల రొదగానీ, ఇంటిముందు మురికి కాలవ గురగుర గానీ అతనికి వినిపించవు. పెళ్ల లూడిన ఇంటి గోడలూ, కూలిపోయే కప్పూ, కప్పుకి పట్టిన బూజూ అతని సమస్యకి పరిష్కారం చూపించవు. కూతురికి కడుపు కాకముందే పెళ్లెందుకు కాలేదో, చిన్న కొడుక్కి వైద్యం అందకముందే చావెందుకు రావాలో, పెద్ద కొడుక్కి ఉద్యోగం రాకముందే మానసిక వృద్ధాప్యం ఎందుకు వచ్చిందో చక్రవర్తి హేతువు కందదు. తన బతుకు చట్రంలో బిగుసుకుపోయిన చక్రవర్తి విలవిలలాడతాడు. ఆ రాత్రి తన మనస్సుతో తనని కసితీరా హింసించుకుంటాడు. కాపాడమని భగవంతుణ్ణి వేడుకుంటాడు. భగవంతుడు సహజంగానే భక్తుల మొర ఆలకించడు. కాబట్టే కూతురికి గర్భాదానం చేసిన కుర్రాడు తెల్లారగానే మాయమవుతాడు. అతని కోసం వెళ్ళిన చక్రవర్తికి అదురుదెబ్బ తగిలి మతి వికటిస్తుంది.

అయినా చక్రవర్తి యథాప్రకారం తన గుమాస్తా గూటికి బయలుదేరుతాడు. ఇంటి ముందు కాలవని ఎప్పటిలా దాటే ఓపిక అతనిలో వుండదు. నడకలో ఎప్పటి వేగమూ వుండదు. మొదటిసారిగా పనికి ఆలస్యంగా వెళతాడు. పనివాళ్లంతా నిశ్శబ్దంగా వుంటారు. ప్రొప్రయిటర్ మొహం కందగడ్డలా మారి వుంటుంది. కారణం అంతకు ముందురోజు షో కేస్‌లో వున్న నెక్లెస్ ఒకటి మాయం కావడమే. ఆ రోజు ఎప్పటి కుర్రాడు రాకపోయేసరికి చక్రవర్తే షో కౌంటర్‌లో వుండడం జరుగుతుంది. అంచేత చమన్‌లాల్ చక్రవర్తి మీదనే అనుమాన పడతాడు. విషయం తెలిసిన చక్రవర్తి తొలిసారిగా తన ప్రియమైన యజమాని మీద భరించలేని విరక్తి కలుగుతుంది. అత నడిగిన పంచాయిషీకి చక్రవర్తి నోటి నుంచి ఒక్క మాట కూడా రాదు-మనస్సు చైతన్యం కోల్పోయి డొల్లగా మారడం వల్ల. నేరం అతని మీదే స్థిరపడుతుంది. నౌకరీకి ఉద్వాసన జరుగుతుంది. చక్రవర్తి కలలో నడుస్తున్నట్టు బయటికి వస్తాడు. భరించలేని దెబ్బ. అది బతుకు మీద దెబ్బ.

నడిబజార్లోకి వచ్చిన చక్రవర్తి ఎక్కడికి పోవాలో, ఏం చెయ్యాలో తెలీని చక్రవర్తి మౌనంగా నిలబడిపోతాడు. జీవితంలో మొదటిసారి నిదానంగా, నిస్సంకోచంగా తలెత్తి చుట్టూ చూస్తాడు. గోడల మీద రంగురంగుల పోస్టర్లు. చౌరాస్తా మధ్య చిరునవ్వుల శిలావిగ్రహం. ఒక దాని వెంట మరొకటిగా పరిగెత్తుతున్న కార్లు, స్కూటర్లు, అనేక వాహనాలు. చకచకా నడిచిపోతున్న వేలమంది మనుషులు. చెవులు గింగిర్లెత్తే రొద. నడకలు, నవ్వులు...మాటలు... కేకలు. ప్రతి కదలికలో శబ్దం...ఉరవడి...వేగం...ఇదేమిటి? ఎన్నేళ్ళ నుంచో తను నేలకు అతుక్కుపోయి వున్నట్టు ప్రపంచమంతా తనని వదిలేసి ఎక్కడికో పరిగెత్తుతున్నట్టు...

చక్రవర్తిలో ఆకారంలేని అనేక ఆలోచనలు. హృదయంలో ఘోష. నాడుల్ని బద్దలు చేస్తూ సముద్రం హోరు...పెను తుఫాను...కిరాణా కొట్టు బాకీ... కొడుకు నిరుద్యోగం...కూతురు కడుపు...దాటలేని మురికి కాలువ...కొంపలో చీకటి...చీకట్లో ఇనప ముక్కు దోమల రొద......పాతికేళ్ళు గానుగెద్దులా ఇంటికీ, షాపుకీ మధ్య చావు నడక-పెంట కంపు కొట్టే బతుకు.

హఠాత్తుగా చక్రవర్తి జుట్టు పీక్కుంటాడు. తన మొహం మీద తనే బలంగా చరుచుకుంటాడు. చౌరాస్తా దద్దరిల్లేలా వికటాట్టహాసం చేసి, ఒక్క వుదుటున ముందుకు గెంతి పరుగందుకుంటాడు. సైకిళ్ళను దాటి, స్కూటర్లను దాటి, కార్లను దాటి, నగరం ఆశ్చర్యపడేలా పిచ్చి బలంతో పరిగెత్తి...... దేన్నో బంధించిన ఏవో సంకెళ్ళను తెంచుకున్నట్టు, ఎక్కడో లోపించిన ఏవో చలనాన్ని సాధించినట్టు...పరిగెత్తి, పరిగెత్తి పైశాచికానందంతో ఎదురుగా కన్పించే ఎలక్ట్రిక్ పోల్ గుద్దుకుని, కపాలం పగిలి, మెదడు చితికి, దారుణంగా చస్తాడు చక్రవర్తి.

అన్నేళ్ళూ చక్రవర్తిలో జీవించిన మృత్యువు మరో ఆశ్రయం వెతుక్కుంటుంది.

చక్రవర్తుల మరణమే అంత.